

దిందాలో గ్రామస్తులకు మ్యానిఫెస్టోను వివరిస్తున్న ఎంపీపీ దుబ్బుల నానయ్య



కౌటాల: గిన్నెలేటిలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వసంత్ రావు

# మరోసారి ఆశీర్వదించండి

- సిర్పూర్ కాగజ్‌నగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే కోనేరు కోనప్ప
- గ్రామాల్లో జోరుగా బీఆర్ఎస్ ప్రచారం

దహెగాం,నవంబర్14: పేదల కోసం ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టిందని ఆ పథకాలు మరింత మెరుగ్గా అందాలంటే మరోసారి ఆదరించి గెలిపించాలని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. మండలంలోని ఐనం, బీబ్రా గ్రామాలతో పాటు భీమిని మండలంలోని కేస్లాపూర్, చిన్నగుడిపేట గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. ప్రభుత్వం రుణమాఫీ కోసం రూ.18 వందల కోట్లను కేటాయించిందని ఇప్పటి వరకు రూ. 14 వందల కోట్ల వరకు రైతులకు రుణమాఫీ అయిందన్నారు. రైతుల రుణమాఫీని ఓర్వలేని కాంగ్రెస్‌కు చెందిన మాజీ పీసీసీ అధ్యక్షుడు కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడం వల్ల కొందరి రైతులకు రుణమాఫీ కాలేదన్నారు. ఎన్నికలు అయిపోయిన తర్వాత రుణమాఫీ కాని రైతులకు మాఫీ అవుతుందని పేర్కొన్నారు. రోడ్లు, విద్యా,వైద్యంతో పాటు ఎంతో అభివృద్ధి చేశానని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. రానున్న ఎన్నికల్లో కారుగుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ ప్రచారంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కాసం శ్రీనివాస్, జడ్పీటీసీ తాళ్లపల్లి శ్రీరామరావు, రైతుబంధు మండల కన్వీనర్ కంబగౌడని సంతోశ్‌గౌడ్, వైస్ఎంపీపీ చౌదరి సురేశ్, సర్పంచ్‌లు బండ కృష్ణమూర్తి, వెలుముల జయందర్, పార్టీ మండలాధ్యక్షుడు ప్రసాద్‌రాజ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**• ప్రచారంలో దూసుకెళ్తున్న బీఆర్ఎస్**

సిర్పూర్(టీ), నవంబర్ 14 : సిర్పూర్(టీ) శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రచారంలో దూసుకెళ్తోంది. మంగళవారం కోనేరు వంశీ కృష్ణ ఆధ్వర్యంలో మండల బీఆర్ఎస్ నాయకులు మండల కేంద్రంలోని దుబ్బగూడ, జ్యోతినగర్ కాలనీల్లో ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి ఎమ్మెల్యే కోనేరు కోనప్పను గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నాయకత్వంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఓటు అభ్యర్థించారు. నియోజకవర్గంలో మరోసారి ఎమ్మెల్యేగా కోనప్పకు అవకాశం ఇవ్వాలని కోరారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు కీజర్ హుస్సేన్, సుహేల్ అహ్మద్, ఈర్త సత్యనారాయణ, తోట మహేశ్, అఖిల్, బోమ్మన శ్రీనివాస్, తంగడిపల్లి సంతోశ్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చింతలమానేపల్లి: రవీంద్రనగర్-2లో కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న కోనేరు వంశీ కృష్ణ

**• జోరుగా బీఆర్ఎస్ ప్రచారం**

కౌటాల, నవంబర్ 14: బీఆర్ఎస్ ప్రచారం రోజురోజుకూ ఊపందుకుంటోంది. ఇప్పటికే అన్ని గ్రామాల్లో ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆదేశాల మేరకు బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను, సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి తెలియజేసిన నాయకులు ప్రచారం మరింత పెంచారు. మంగళవారం బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఆదె వసంత్‌రావు మ ండలంలోని గిన్నెలేటిలో కోనప్ప చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల, మ్యానిఫెస్టో గురించి ప్రజలకు వివరించారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ కారు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరా రు. ఆయన వెంట నాయకులు మధుకర్, నాందేవ్, సతీశ్, వెంకటేశ్, గ్రామస్తులు ఉన్నారు.

**• బీఆర్ఎస్ ప్రచార జోరు**

చింతలమానేపల్లి, నవంబర్ 14: బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోనేరు కోనప్ప గెలుపు కోసం బీఆర్ఎస్ నాయకులు మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ డుబ్బుల నానయ్య దిందా లో బీఆర్ఎస్ నాయకులుఇంటింటా తిరుగుతూ బీఆర్ఎస్ మ్యానిఫెస్టో, సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యే కోనప్ప కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ డాగె సురేశ్, నాయకులు డోకె నారాయణ, సత్యనారాయణ, లక్మాజి, చౌదరి నారాయణ, పాలే సత్తన్న, కార్యకర్తలు పాల్గొన్నారు.

**• బీఆర్ఎస్‌లో చేరిక**

చింతలమానేపల్లి, నవంబర్ 14 : మండలంలోని రవీంద్రనగర్-2 గ్రామానికి చెందిన పలువురు నాయకులు, యువకులు బీఎస్పీ, బీజేపీ పార్టీలను వీడి బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారిని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోనేరు కోనప్ప తనయుడు కోనేరు వంశీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సూరజ్‌దాస్, సంజీవ్, బాల జోగేశ్, మనీశ్, గ్రామస్థులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## వారసంతలో సెల్‌ఫోన్‌ల చోరీలు

కౌటాల, నవంబర్ 14: మండల కేంద్రంలో ప్రతి సోమవారం నిర్వహించే వారసంతలో ఒక్క రోజే 9 సెల్‌ఫోన్‌లు చోరీకి గురయ్యాయి. సోమవారం వారసంతకు కూరగాయలు కొనుగోలు చేసేందుకు వెళ్లిన 9మంది సెల్‌ఫోన్‌లను గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారు. గత సోమవారం కూడా ఇదే వారసంతలో ఆరుగురి సెల్‌ఫోన్‌లు దొం గలించబడినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తాజాగా సోమవారం ఏకంగా తొమ్మిది మంది సెల్‌ఫోన్‌లు చోరీకి గురికావడంతో విషయం బయటకు వచ్చింది. సెల్‌ఫోన్‌లు పోయిన వారిలో మండల కేంద్రానికి చెందిన షహీన్ బాబా, లూర్దయ్య, దుర్గం మాధవ్, రాజేశ్వర్, ప్రవీణ్ రవీందర్ పెందోర్, సిర్పూర్(టీ) మండలం డోర్‌పల్లి కొమ్ముగూడకు చెందిన గోప శ్రీనివాస్‌లతో పాటు మరో ముగ్గురు వ్యక్తుల సెల్‌ఫోన్‌లు పోయినట్లు బాధితులు తెలిపారు. ఫోన్‌లు పోగుట్టుకున్న వారంతా కూరగాయలు కొనుగోలు చేసే సమయంలోనే పక్కకు గుర్తు తెలియని కొత్త ముగ్గురు వ్యక్తులు వచ్చినట్లు వారు పోయిన తర్వాత తమ ఫోన్‌లు కనిపించలేదని బాధితులు తెలిపారు. గతంలో ఇదే వారసంతలో సంతకు వచ్చే మహిళల పర్సులు, డబ్బులు దొంగలించిన ఘటనలు, మరి కొంతమంది పోకిరీలు మహిళలు, అమ్మాయిలను వేధించిన ఘటనలు కూడా ఉన్నాయి. అయితే తాజాగా రెండు వారాల నుంచి సెల్‌ఫోన్‌లు దొంగతనాలకు గురి కావడంతో ప్రజల్లో భయం మొదలయింది. వెంటనే బాధితులు మీసేవాకు వెళ్లి తమ ఐఎంఈఐ నంబర్‌తో పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారసంతలో పోలీసులను భద్రతగా పెట్టాలని, వారసంతలో జులాయిగా తిరిగేవారు, అనుమానాస్పద కొత్త వ్యక్తులు, పోకిరి వేశాలు వేసే వారిపై పోలీసు లు దృష్టి సారించాలని బాధితులు కోరుతున్నారు.



సహకార జెండాను ఆవిష్కరించి సెల్యూట్ చేస్తున్న చైర్మన్ ఓంప్రకాశ్

## సహకార వారోత్సవాలు ప్రారంభం

బెజ్జూర్, నవంబర్ 14 : మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో సహకార వారోత్సవాలను చైర్మన్ కుర్సింగ ఓంప్రకాశ్ మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భంగా సంఘం ఆవరణలో సహకార జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ నెల 21 వరకు వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సంఘం అభివృద్ధితో పాటు రైతుల అభివృద్ధిపై ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఇక్కడ సీఈవో సం జీవ్, సిబ్బంది వెంకటేశ్వర్ గౌడ్, సత్య నారాయణగౌడ్ దేవాజి, మహేశ్ పాల్గొన్నారు.

## డయాబెటీస్‌పై అవగాహన



బెజ్జూర్: మండల కేంద్రంలో ర్యాలీ తీస్తున్న వైద్యాధికారి అవినాశ్, సిబ్బంది

బెజ్జూర్, నవంబర్ 14 : ప్రపంచ మధుమేహ వ్యాధి దినోత్సవం సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీ వైద్యాధికారి అవినాశ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైద్యాధికారి మాట్లాడుతూ, షుగర్ సోకిన విషయం కూడా తెలియకుండానే ఈ వ్యాధి సోకి చాలా మంది ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. షుగర్ వ్యాధిగ్రస్తులు వైద్యుల సూచనలు సలహాలు పాటిస్తూ వ్యాధి ఎక్కువ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌టి దిలీప్ కుమార్, స్టాఫ్ నర్సు అనందిత, ఫార్మాసిస్టు అయేషా తబస్సూం, ఏఎన్ఎంలు స్వరూప, సునిత, ఆశలు , సిబ్బంది పాల్గొన్నారు.

## ఉషూ పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

కాగజ్‌నగర్, నవంబర్ 14: కాగజ్‌నగర్ పట్టణంలోని ఫాతిమా కాన్వెంట్ విద్యాలయానికి చెందిన విద్యార్థినులు ఉషూ పోటీల్లో ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్ ఆఫ్ ఇండియా ఉషూ చాంపియన్ షిప్ పోటీలు వరంగల్‌లోని తోర్రుర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఇటివలే నిర్వహించారు. రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీల్లో పాల్గొన్న ట్వింకల్ రాయ్ మొదటి స్థానం సాధించగా, బిందు రెండో స్థానం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. డిసెంబర్‌లో జార్ఖండ్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి ఉషూ పోటీల్లో వీరిద్దరు పాల్గొంటారని అధికారులు స్పష్టం చేశారు. మంగళవారం జిల్లా విద్యాధికారి పార్శి అశోక్ ఉషూ పోటీలకు ఎంపికైన విద్యార్థినులను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ గేమ్ సెక్రెటరీ సాంబశివరావు, కోచ్ దేవయ్య, పీఈటీ ఏడుకొండలు, ఫాతిమా కాన్వెంట్ ప్రిన్సిపల్ సాఫల్యా పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు రైలు ఢీకొని ఒకరి మృతి

సిర్పూర్(టీ), నవంబర్ 14 : సిర్పూర్(టీ) రైల్వేస్టేషన్ సమీపంలోని రైలు పట్టాలపై మంగళవారం రైలు ఢీకొని మండలకేంద్రానికి చెందిన పత్తి శంకర్ మృతి చెందాడు. కాగజ్‌నగర్ జీఆర్పీ హేడ్ కానిస్టేబుల్ సురేశ్‌గౌడ్ తెలిపిన ప్రకారం.. మండలకేంద్రంలోని పేట్ మహేశా కాలనీకి చెందిన పత్తి శంకర్ (57) అనే వ్యక్తి తెల్లవారుజామున రైల్వే ప్లాట్‌ఫాంపై వాకింగ్ చేశాడు. అనంతరం బహిర్భుమికి రైల్వే ట్రాక్ దాటుతుండగా మంచిర్యాల నుంచి బల్హార్షాకు వైపు వెళ్లే గుర్తు తెలియని రైలు ఢీకొని మృతి చెందినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, శవ పంచనామా నిర్వహించి, మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

## గుడుంబా పట్టివేత

బెజ్జూర్, నవంబర్ 14 : మండలంలోని సలుగుపల్లి గ్రామానికి చెందిన లావుడె రాజేందర్ అక్రమంగా గుడుంబాను రవాణా చేస్తుండగా పట్టుకున్నట్లు ఎక్సైజ్ శాఖ సీఐ మంగమ్మ తెలిపారు. ఆమె తెలిపిన ప్రకారం.. మంగళవారం ఎక్సైజ్ సిబ్బందితో మండంలోని సలుగుపల్లి చైరస్తా వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా రాజేందర్ తన స్కూటిపై 10 లీటర్ల గుడుంబాను తరలిస్తూ పట్టుబడినట్లు తెలిపారు. వాహనాన్ని సీజ్ చేసి రాజేందర్ పై కేసు నమోదు చేసినట్లు ఆమె తెలిపారు. అదేవిధంగా తలయా గ్రామ సమీపంలోని ప్రాణహిత నదీ పరివాహక ప్రాంతాల్లో గుడుంబా తయారికి సిద్ధంగా ఉన్న 3 వేల లీటర్ల బెల్లం పానకం లభ్యమైనట్లు తెలిపారు. పానకం ఉన్న ప్లాస్టిక్ డ్రమ్ములను ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు కిషన్, స్వాతి ,సిబ్బంది కుమార్, మల్లేశ్, హుస్సేన్, శ్రవంతి పాల్గొన్నారు.

## 'తొలిమెట్టు పకడ్బందీగా అమలు చేయాలి'

రెబ్బెన, నవంబర్ 14 : విద్యార్థులకు తొలిమెట్టు కార్యక్రమం పకడ్బందీగా అమలు చేయాలని వరంగల్ ఆర్‌జెడీ సత్యనారాయణ అన్నారు. మండలంలోని రేకులగూడ, సోనాపూర్, కైర్‌గాం, వంకులంలోని ప్రాథమిక పాఠశాలలు, ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించి ఆయా పాఠశాలలో జరుగుతున్న తొలిమెట్టు కార్యక్రమం గురించి తెలుసుకొని విద్యార్థుల సూక్ష్మ సామర్థ్యాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీఎం కేసీఆర్ అల్పాహార పథకం అన్ని పాఠశాలల్లో సక్రమంగా అమలు అయ్యే విధంగా చర్యలు తీసుకొవాలని, మధ్యాహ్న భోజనం పథకం కూడా పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. తొలిమెట్టుపై ఉపాధ్యాయులకు పలు సలహాలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రెబ్బెన ఎంఈవో, డీసీఈబీ సెక్రటరీ వెంకటేశ్వరస్వామి, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.